## క్లుప్తంగా

### అంకితభావంతో విధులు నిర్వహించండి

**చీరాల టౌన్‌:** గ్రామ సచివాలయాల ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించాలని ఎంపీడీఓ శివసుబ్రమణ్యం సూచించారు. శుక్రవారం మండలంలోని దేవాంగపురి, సాల్మన్‌సెంటర్‌ గ్రామ పంచాయతీల్లోని సచివాలయాలను ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యల అర్జీలు, సచివాలయ ఉద్యోగుల పనితీరు, రికార్డులను పరిశీలించారు. సచివాలయానికి కేటాయించిన ఉద్యోగుల హాజరు, శాఖల వారీ ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. సచివాలయాల ఉద్యోగులు విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. విధుల్లో అలసత్వం వహించిన చర్యలు తప్పవన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, విధుల పట్ల అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### పొదుపు గ్రూపుల అభ్యున్నతి ధ్యేయం

**చీరాల టౌన్‌:** మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకునేలా కృషి చేయాలని ఏపీఎం మధుసూదనరావు సూచించారు. శుక్రవారం మండలంలోని బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో ఐకేపీ మండల సమాఖ్య ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధి పెంచేలా పొదుపు సంఘాల ఏపీఎంలు, అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వీవోఏలు పనితీరు మార్చుకుని చక్కగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రతినిధులు, సీసీ, సీవీలు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారంలో అశ్రద్ధ వద్దు

**చీరాల టౌన్‌:** ప్రజలకు ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది అలసత్వం వహించకుండా నిబద్ధతతో పనిచేయాలని తహసీల్దార్‌ కె.గోపికృష్ణ సూచించారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలోని సమావేశపు హాలులో రెవెన్యూ ఉద్యోగులతో తహసీల్దార్‌ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరగా విచారణలు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి జవాబుదారీగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం అందించే రెవెన్యూ సేవలను అందరికి అందించాలన్నారు. భూములకు సంబంధించిన రికార్డులు విధిగా ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. డీటీ సుశీల, ఆర్‌ఐలు శేఖర్‌, సత్యం, మండల సర్వేయర్‌ బ్రాహ్మణయ్య, వీఆర్వోలున్నారు.

### 33 మందికి చెక్కుల పంపిణీ

**అద్దంకి రూరల్‌:** అద్దంకి నియోజకవర్గంలోని 33 మంది లబ్ధిదారులకు రూ.4.77 లక్షల విలువైన సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులను మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ శుక్రవారం చిలకలూరిపేటలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అలాగే మండలంలోని నిర్మాణంలో ఉన్న బీటి రోడ్లను పరిశీలించారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీపడవద్దని అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్‌ రోడ్ల నిర్మాణాలకు సబంధించి రూ. 24 కోట్లతో అంచనాలు తయారుచేసి పంపాలని ఆశాఖ అధికారులన్నారు.

### 16న వాహనాల వేలం

**చీరాల:** పలు కేసుల్లో సీజ్‌ చేసిన వాహనాలను ఈనెల 16న ఉదయం 11గంటలకు చీరాల ఎక్సైజ్‌ పోలీస్‌స్టేషన్‌లో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్‌ సీఐ పి.నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఎక్సైజ్‌ చట్టం ప్రకారం సీజ్‌ చేసిన వాహనాలను ప్రభుత్వ పరం చేసి వేలం ద్వారా అమ్ముతామన్నారు. పూర్తి వివరాలకు 9440902495, 8106662128 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### శింగరకొండ దర్శిని



**అద్దంకి:** క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం వైశాఖ మాసం చిత్త నక్షత్రం త్రయోదశి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మానాయుడు శుక్రవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరినకోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీ సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.



గొర్రెపాడులో కొనుగోలుదార్లు రాక తోటల్లోనే కాయలు



కూకట్లపల్లిలో మల్చింగ్‌ విధానాన్ని పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారులు

# పుచ్చ రైతు విలవిల

- కొనే నాథుడు లేక పొలాల్లోనే కాయలు
- కూకట్లపల్లి, గొర్రెపాడు గ్రామాల్లో మల్చింగ్‌ విధానంలో 320 ఎకరాల్లో సాగు
- ఎకరా సాగుకు రూ. 60 వేల నుంచి రూ. 70 వేల వరకు పెట్టుబడులు

**బల్లికురవ:** సంప్రదాయ పంటలకు భిన్నంగా ఉద్యానవన పంటలను నమ్ముకున్నా అవి కూడా నట్టేట ముంచుతున్నాయి. బల్లికురవ మండలంలోని కూకట్లపల్లి, గొర్రెపాడు గ్రామాల రైతులు ప్రయోగాత్మకంగా పుచ్చ సాగు చేపట్టి నష్టాల పాలయ్యారు. కాయలు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు తోటల వద్దకు రానందున, పొలాల్లోనే పండి ఎండిపోతున్నాయి. వేసవి ఎండల తీవ్రత నుంచి ఉపశమనంతో పాటు, పలు రకాలు పోషకాలు, ఖనిజాలుండే పుచ్చ.. మనిషి బరువు తగ్గించడంలో కూడా సాయం చేస్తుంది. కాగా కొరిశపాడు మండలంలో గత 5 సంవత్సరాలుగా పుచ్చసాగుతో రైతులు లాభాలు అర్జిస్తుండటంతో.. కూకట్లపల్లి, గొర్రెపాడు గ్రామాల రైతులు ముందుకొచ్చారు. ఫిబ్రవరి మొదటివారం రెండు గ్రామాల్లో చీడ పీడలు ఆశించకుండా మల్చింగ్‌ విధానంలో మడులు



కూకట్లపల్లిలో సాగులో ఉన్న పుచ్చతోట

తయారీతో 320 ఎకరాల్లో షుగరుబేబి, అర్కామానిక్‌, కిరణ్‌, అర్కాజ్యోతి, పూజబేదన, సువర్ణిమ రకాలు సాగు చేశారు.

**ఉద్యానశాఖ సూచనలతో..**

అధిక దిగుబడులు సాధించేందుకు ఉద్యానశాఖ సలహాలు సూచనలు ఆరంభం నుంచి పాటించారు. బాపట్ల జిల్లా ఉద్యానాధికారి పి. జెనెమ్మ, మర్టూరు ఉద్యానాధికారి బి. హనుమంతనాయక్‌, రెండు గ్రామాల్లో సాగుచేసిన పంటను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఆరంభం నుంచి చీడపీడలు సోకకుండా క్రిమిసంహారక మందులు పిచికారీ, మోతాదు ప్రకారం ఎరువులు వేయడంతో ఏప్రిల్‌ మొదటి వారానికి కాయలు నాణ్యతతో కోతకు వచ్చాయి. ఆరంభం ఏప్రిల్‌ మొదటి వారంలో కిలో రూ. 10 నుంచి రూ. 12 కొనుగోలుకు వ్యాపారులు తోటల వద్దకు వచ్చారు. రెండు గ్రామాల్లో తొలికోత ఆరుగురు రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఆ తదుపరి గిరాకీ లేదంటూ వ్యాపారులు కొనుగోళ్లకు రావటంలేదని రైతులు వాపోయారు. ఎకరా సాగు రూ. 60 వేల నుంచి రూ. 70 వేల వరకు పెట్టుబడులు పెట్టామని చెప్పారు. కొనుగోలుదారులు రానందున తోటల్లోనే కాయలు పండి ఎండిపోతున్నాయని, పంట సాగుకు తెచ్చిన పెట్టుబడులు ఎల తీర్చాలో అంతుచిక్కటం లేదని రైతులు వాపోతున్నారు. పంటసాగుచేసిన తమను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

**3.5 లక్షల పెట్టుబడి పెట్టా**



ఆరు ఎకరాల్లో తన సొంత పొలంతో పాటు కౌలుకు తీసుకుని పుచ్చ సాగు చేపట్టా. వ్యాపారులు కొనుగోలుకు రానందున తొటల్లోనే కాయలు పండి ఎండిపోతున్నాయి. రూ. 3.5 లక్షల వరకు పెట్టుబడులయ్యాయి. – తాటిపర్తి భాస్కరరెడ్డి (రైతు)

**కౌలుకు తీసుకుని సాగుచేశా**



ఎకరా కౌలుకు తీసుకుని పుచ్చసాగు చేశా. దిగుబడి ఆశాజనకంగానే ఉంది. కోనుగోలుదారులు.. గిరాకీ లేదంటూ ముందుకు రావటం లేదు. నెలరోజులుగా తోటలోనే కాయలు పండి ఎండిపోతున్నాయి. పంటసాగుకు తెచ్చిన పెట్టుబడి, కౌలు ఎలా చెల్లించాలో అంతు చిక్కటంలేదు. – జంధ్రాజుపల్లి పూర్ణచంద్రరావు (రైతు)

## బాల్య వివాహాలతో అనర్థాలు తప్పవు



మార్టూరులో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

**వేటపాలెం:** బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ సజ్జా పుష్పవల్లి పేర్కొన్నారు. వేటపాలెం సెక్టార్‌ పరిధిలోని రావూరిపేట వన్‌ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం నిర్వహించారు. సూపర్‌వైజర్‌ మాట్లాడుతూ 18 ఏళ్ల నిండని బాలికలు వివాహం చేసుకుంటే పుట్టే బిడ్డలకు, తల్లులకు ఎన్నో ఆరోగ్య సమస్యలు ఎదువుతాయని తెలిపారు. రుతుక్రమం క్రమం తప్పకుండా రావాలంటే బాలికలు పౌష్టికాహారాన్ని.. వ్యాయామాన్ని తప్పనిసరిగా చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. మహిళా పోలీస్‌ కల్పన, అంగన్‌వాడీ కార్యక్తలు ఎస్‌. సరళ, భ్రమరాంబ, రమాదేవి, నాగమణి పాల్గొన్నారు.

**మార్టూరు:** బాల్య వివాహాలు శారీరక, మానసిక, సామాజిక ఎదుగుదలను అడ్డుకుంటాయని వాటి నివారణకు కృషి చేయాలని పర్చూరు ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ టి. శిరీష పిలుపునిచ్చారు. మార్టూరులోని సచివాలయం ఒకటిలో మాట్లాడారు. నిర్దిష్ట వయస్సు వచ్చేవరకు వివాహం చేసుకోబోమని బాలికలతో, తమ పిల్లలకు బాల్యవివాహాలు జరిపించబోమని తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. ఏఎన్‌ఎంలు కె. ప్రమీల రాణి, జి. శారద, మహిళా సంరక్షకురాలు ఏ. మాధురి, కార్యకర్తలు పీవీ సుశీల, జె. దయమ్మ, రాజ్యం, పి.



కారంచేడు: శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సీడీపీఓ ఝాన్సీ



మాట్లాడుతున్న సూపర్‌వైజర్‌ పుష్పవల్లి

నాగజ్యోతి, అరుణ కుమారి పాల్గొన్నారు.

**కారంచేడు:** కౌమార బాలికలకు అవగాహన కల్పిస్తున్నామని ఐసీడీఎస్‌ ఇంకొల్లు ప్రాజెక్టు సీడీపీఓ తిరుమలశెట్టి ఝాన్సీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కారంచేడు గ్రామంలోని అనేక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుల్లో మాట్లాడారు. సూపర్‌వైజర్‌ హిమబిందు, హేమలత, మౌనిక, భూలక్ష్మి, జగదీశ్వరి, ఏఎన్‌ఎం, ఆశ, వీఓఏలు పాల్గొన్నారు.

**స్వర్ణ గ్రామంలో..**

మండలంలోని స్వర్ణ గ్రామంలో ఐసీడీఎస్‌ స్వర్ణ సెక్టార్‌ సూపర్‌వైజర్‌ సునీత ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కిశోర బాలికలకు అవసరమైన వేసవి తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంలోని అన్ని కేంద్రాల అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

### సారవంతమైన నేలలు గుర్తించండి

**చినగంజాం:** రైతులు పంట సాగు చేయబోయే ముందు సారవంతమైన నేలను గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రకృతి వ్యవసాయం యూనిట్‌ ఇన్‌చార్జ్‌ జయమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని నీలాయపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రకృతి వ్యవసాయ విభాగం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై గ్రామ స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో రైతులకు అవగాహన కలిగిస్తూ ప్లకార్డులు చేత ధరించి ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులకు ప్రీ మాన్‌సూన్‌ డ్రై సోయింగ్‌(పీఎండీఎస్‌) విధానంపై వివరించారు. సారవంతమైన నేలను గుర్తించి వ్యవసాయానికి అనుగుణంగా చేసుకోవాలన్నారు. తొలకరిలో చిరుధాన్యాలు భూమిలో వేసుకోవాలి వాటిపై అవగాహన కల్పించారు. పలువురు రైతులకు పీఎండీఎస్‌ కిట్స్‌ అందజేశారు. అనంతరం గ్రామానికి చెందిన ఆదర్శ రైతులు పాలేటి ఆదినారాయణ, గుడివాడ సుబ్బారావుకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌ తూమాటి శ్రీనివాసరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు తూమాటి సూర్యకళ, వెలుగు సీసీ వెంకటస్వామి, వీఓఏ మమత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పి. లోకేశ్వరి, పి. భార్గవి, టి. రజిని, జి. పద్మ పాల్గొన్నారు.

### 15న 'పది' విద్యార్థులకు పురస్కారాలు

**చీరాల అర్బన్‌:** రోటరీ క్లబ్‌ ఆధ్వర్యంలో ఈనెల 15న ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి పరీక్షల్లో ఫస్ట్‌ మార్కులు సాధించిన విద్యార్థులకు రోటరీ క్లబ్‌ చీరాలలో సన్మానం, నగదు బహుమతి, ప్రశంస పత్రాన్ని అందించనున్నట్లు క్లబ్‌ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. దోగుపర్తి వెంకట సురేష్‌ విద్యార్థులను సన్మానించనున్నట్లు తెలిపారు. అలానే పందిళ్ళపల్లి జెడ్పీ హైస్కూల్‌ విద్యార్థిని సజ్జా దివ్యశ్రీ 596 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు సాధించినందుకు న్యాయవాది బండారుపల్లి హేమంత్‌కుమార్‌ సన్మానించి రూ.11,116లు నగదు బహుమతిని అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల వెంట తల్లిదండ్రులు, ఒక ఉపాధ్యాయుడు పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 9866137914 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు. దోగుపర్తి వెంకట సురేష్‌, పోలుదాసు రామకృష్ణ, మామిడాల శ్రీనివాసరావు, జీవై ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

## కౌలుదారులకు గుర్తింపు కార్డులు

**కారంచేడు:** గ్రామాల్లోని రైతులు, కౌలు రైతులు సాగు హక్కు పత్రాలపై సరైన అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్‌ జి. నాగరాజు అన్నారు. శుక్రవారం కొడవలివారిపాలెం గ్రామంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల సంయుక్త సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. కౌలు రైతులు తప్పకుండా గుర్తింపు కార్డులను తీసుకోవాలన్నారు. ఇవి తీసుకోవడం వలన ప్రభుత్వం కౌలు రైతులకు అందించే అన్ని రకాల సర్వీసులు సకాలంలో అందుతాయన్నారు. వ్యవసాయాధికారి కె. సుధీర్‌బాబు మాట్లాడుతు ఈ కౌలు కార్డులున్న వారికి ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులకు బీమా, వ్యవసాయ రుణాలు వంటి అనేక పథకాలకు అర్హులవుతారన్నారు. పలువురు కౌలు దారులకు ఆయన కార్డులు పంపిణీ చేశారు. ఆర్‌ఐ



కొడవలివారిపాలెంలో కౌలు రైతు కార్డులు అందిస్తున్న తహసీల్దార్‌, ఏఓ

జగదీష్‌, వీఆర్‌ఓలు, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## వైభవంగా చెన్నకేశవుని బ్రహ్మోత్సవాలు

**ఒంగోలు మెట్రో:** నగరంలోని కొప్పోలు చెన్నకేశవ ఆంజనేయస్వామి దేవస్థానంలో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రెండో రోజు వైఖానస ఆగమ శాస్త్రంగా జరుగుతున్న కార్యక్రమంలో ఉదయం ధ్వజారోహణం, చప్పరా సేవా హోమాలు, బలిహరణ, సహస్ర నామార్చన కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు పరాంకుశ సమీర్‌ వైభవంగా నిర్వహించారు. రాత్రి ఎనిమిది గంటలకు శేషవాహన ఉత్సవం కనుల పండగ నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వాణా అధికారి, స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి ఆశీస్సులు అందుకున్నారు.



భక్తులకు దర్శనమిస్తున్న గరుత్మంతుడు

### చిన అంబడిపూడిలో వ్యర్థాల తరలింపు

సాక్షి ఎఫెక్ట్‌..

**బల్లికురవ:** మండలంలోని చినఅంబడిపూడి గ్రామంలోని బీసీ కాలనీ, ప్రాథమిక పాఠశాల పరిసరాల్లోని మురుగు కాలువల్లో వ్యర్థాలను గ్రామాలకు దూరంగా తరలించారు. శనివారం సాక్షిలో 'మురుగు–దుర్గంధం' అన్న శీర్షికతో ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. ఎంపీడీఓ కుసుమకుమారి ఆదేశాల మేరకు పంచాయితీ సెక్రటరీ షేక్‌ సాదక్‌ వలి కాలువల్లోని వ్యర్థాలను కార్మికులచే ట్రాక్టర్‌లో గ్రామానికి దూరంగా పడవేయించారు. వాడిన కవర్లు, దుమ్ము ధూళి.. ఈదురుగాలులకు ఇళ్లలోకి చేరి వ్యాపిస్తున్న దుర్గంధానికి పరిష్కారం లభించింది. ఎంపీడీవో, సెక్రటరీ సెక్రటరీ, సాక్షికి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.



చిన అంబడిపూడిలో వ్యర్థాలు తరలిస్తున్న కార్మికుడు

## వచ్చామా.. వెళ్లామా!



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈ బ్రహ్మయ్య



సమావేశంలో పాల్గొన్న అధికారులు

- తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం
- 14 మంది సర్పంచ్‌లకు ఒకరు మాత్రమే హాజరు
- 38 నిమిషాల్లో ముగిసిన సమావేశం

**యద్దనపూడి:** 'సమావేశమన్నారు.. వచ్చాం.. అధికారులు చెప్పింది విన్నాం..ఇక వెళ్లిపోదాం' ఇదీ యద్దనపూడి మండల సర్వసభ్య సమావేశం జరిగిన తీరు. శుక్రవారం ఎంపీపీ పులగం రజనీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా అధికారులు, సభ్యులు ఆలస్యంగా రావటంతో గంటల 3.05 గంటలకు ప్రారంభించి 3.43కు సమావేశాన్ని ముగించారు. తొలుత పహల్గాంలో ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి నివాళులర్పిస్తూ రెండు నిముషాలు మౌనం పాటించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖల ద్వారా ప్రజలకు కల్పిస్తున్న పథకాల గురించి తెలియజేశారు. అధికారులు చెప్పే ప్రగతి నివేదికలు వినటమే తప్ప గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించండి అనే ప్రజా ప్రతినిధి ఈ సమావేశంలో కరువయ్యారు. 14 మంది గ్రామ సర్పంచ్‌ల్లో శ్యామలవారిపాలెం సర్పంచ్‌ గైర్హాజరయ్యారు. ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, సీడీపీఓ సుభద్ర, పంచాయతీ రాజ్‌ ఏఈ ఆనంద్‌, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈ బ్రహ్మయ్య, ఎంఈఓ గోపి, వ్యవసాయాధికారి మేరమ్మ, విద్యుత్‌శాఖ ఏఈ సురేష్‌, తదితరులు పాల్గొన్నారు.

## టీచింగ్‌ లెర్నింగ్‌ కిట్ల పంపిణీ

**అద్దంకి:** స్థానిక భవిత కేంద్రంలోని ముగ్గురు విద్యార్థులకు శుక్రవారం టీచింగ్‌ లెర్నింగ్‌ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారి బి. సుధాకర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ సమగ్ర శిక్ష బాపట్ల వారి ద్వారా బోధనోపకరణాలు విద్యార్థులకు అందజేసినట్లు చెప్పారు. ఈ ఉపకరణాలు విద్యార్థుల భవితకు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. కిట్లను బడివరకు నడవలేని బుద్ధి మాంద్యత కలిగి ఇంటి వద్దనే చదువుకుంటున్న జడా సందీప్‌, ధర్మవరం విద్యార్థిని మేరీ, ఎన్టీఆర్‌ నగర్‌కు చెందిన కొండా వెంకట గోపీచంద్‌లకు అందజేశామని వివరించారు. ఒక్కో కిట్టు విలువ రూ.15 వేలు ఉంటుందని చెప్పారు. ఉపాధ్యాయులు జగన్నాథం బాబూరావు, కందుల గంగాధర్‌, సీఆర్‌పీ రామకృష్ణ, కొంగల శ్రీనివాసు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉపకరణాలను అందజేస్తున్న ఎంఈవో సుధాకర్‌రావు

## అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వండి

**కారంచేడు:** గ్రామాల్లో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులున్నా, వాహనాలు కనిపించినా వెంటనే తమకు సమాచారం అందించాలని ఎస్‌ఐ వి. వెంకట్రావు అన్నారు. శుక్రవారం వేకువజాము నుంచి.. కర్ణాటక, తెలంగాణా, చెన్నై ప్రాంతాల నుంచి వచ్చే ట్రావెల్స్‌ బస్సులు, కార్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. బాపట్ల ఎస్పీ తుషార్‌ డూడీ ఆదేశాల మేరకు వాహన తనిఖీలను ముమ్మరం చేశామన్నారు. కొత్త వారికి ఆసరా కల్పించవద్దని హెచ్చరించారు.



కారంచేడు వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

## మంత్రికి కుంభాభిషేక ఆహ్వానం

**అద్దంకి రూరల్‌:** ఈనెల 14 నుంచి 19 వరకు నిర్వహించనున్న మహాకుంభాభిషేకానికి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి హాజరు కావాలంటూ శింగరకొండ దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శుక్రవారం వేదపండితులతో వెళ్లి ఆహ్వాన పత్రిక అందజేసి ఆహ్వానించారు. మహోత్సవానికి తప్పక హాజరుకావాలని కోరారు. రాతి ముఖమండప నిర్మాణానికి రూ. లక్ష విరాళం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన నూతన ముఖ మండప నిర్మాణానికి వైదన గ్రామానికి చెందిన యక్కల సుబ్బారాయుడు, ధనమ్మ జ్ఞాపకార్థం కుమారుడు చలపతిరావు, వెంకాయమ్మ రూ. 1,00,000 విరాళాన్ని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడుకు శుక్రవారం అందజేశారు.



లక్ష విరాళాన్ని అందజేస్తున్న దాత

## భారత సైనికుడు మురళి నాయక్‌కు సంతాపం



వీరమరణం పొందిన సైనికునికి సంతాపం తెలియజేస్తున్న వృద్ధులు

**చినగంజాం:** భారత్‌– పాక్‌ మధ్య జరుగుతున్న యుద్ధంలో గురువారం రాత్రి అసువులు బాసిన ఆంధ్రప్రదేశ్‌ సత్యసాయి జిల్లాకు చెందిన యుద్ధ సైనికుడు మురళి నాయక్‌ ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ పలువురు సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక వాల్మీకి వృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులు వీర సైనికుని ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించి తమ సంతాపాన్ని తెలియజేశారు. భారత్‌ నిర్మాణ్‌ వలంటీర్‌ ఈ గోవిందస్వామి మాట్లాడుతూ యుద్ధంలో పాకిస్తాన్‌ జరిపిన ఎదురు కాల్పుల్లో మురళి నాయక్‌ మృతి చెందడం బాధాకరం అంటూ తన సంతాపాన్ని ప్రకటించారు. సంతాపం ప్రకటించిన వారిలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి, ఎం. హేమంత్‌కుమార్‌ రెడ్డి, టీటి, శ్రీనివాసరావు, ఎస్‌. నరసింహారావు, వై. రామాంజనేయులు తదితరులున్నారు.